## నిలిచిన మురుగు.. ప్రజలకు అవస్థలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు


బావుసాయిపేట బస్టాండ్ ఆవరణలో నిలిచిన నీరు

కోనరావుపేట, మే 24: మండలంలోని బావుసాయిపేట గ్రామంలో బస్టాండ్ ప్రాంతంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సీసీరోడ్డు కిందకి కావడంతో చిన్నపాటి వర్షం కురిసిన నీరంతా నిల్వ ఉండిపోతుంది. దీంతో నీరు ఎటూ పోయేందుకు వీలు లేకపోవడంతో మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ క్రమంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రధానంగా బస్టాండ్ ప్రాంతం కావడంతో అక్కడే ప్రయాణికులు ఎక్కువగా రద్దీ ఉండడం, చుట్టూ కిరాణా షాపులు, హోటళ్లు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రతి బుధవారం అక్కడే వారసంత నిర్వహిస్తుండడంతో కూరగాయలు అమ్మేవారు, కొనేవారు కూడా ఇబ్బంది పడాల్సివస్తున్నది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### అధికారులు సమస్య పరిష్కరించాలి

గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉండి మురుగుగా మారుతోంది. ప్రధాన రోడ్డు ఎత్తుగా ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు ఎటూ వెళ్లలేక దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండ్ ప్రాంతం కావడంతో దుర్వాసన వల్ల ప్రయాణికులు నిలుచుకోవడానికి ఇబ్బందిగా మారింది. పక్కనే టిఫిన్ సెంటర్, టీ స్టాల్ ఉండగా, కాలనీవాసులు అదే మురుగు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తున్నది. పంచాయతీ అధికారి సమస్యను పట్టించుకొని గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

-రమేశ్, గ్రామస్తుడు, బావుసాయిపేట

## కేటీఆర్ ఫొటో లేకపోతే ఊరుకోం

- అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించాల్సిందే
- మరోసారి పునరావృతమైతే అడ్డుకుని తీరుతాం
- బీఆర్ఎస్ నాయకుడు మాట్ల మధు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు మాట్ల మధు, మెంగని మనోహర్, సిలువేరి చిరంజీవి

సిరిసిల్ల టౌన్, మే 24: ప్రజల ఆశీర్వాదంతో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేటీఆర్ ఫొటో అధికారిక కార్యక్రమాల్లో పెట్టకపోతే ఇకపై బీఆర్ఎస్ సైనికులు ఊరుకోబోరని బీఆర్ఎస్ నాయకుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు హెచ్చరించారు. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన వ్యక్తి కేకే మహేందర్‌రెడ్డి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం సిగ్గుచేటని విమర్శించారు. కలెక్టర్‌కు అంతగా ప్రేమ ఉంటే మహేందర్‌రెడ్డిని ప్రైవేటు ప్రోగ్రాంలకు పిలుచుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాల్లో చట్టబద్ధంగా గెలిచిన కేటీఆర్ ఫొటో లేకుండా అధికారిక కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. కలెక్టర్ హోదాలో ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గంభీరావుపేటలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ఫొటో లేదని అడిగిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భాగంగా నియోజకవర్గంలో జరుగుతున్న అనేక అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన మహేందర్‌రెడ్డికి ప్రాధాన్యం కల్పించడం విడ్డూరంగా ఉందన్నారు. శని, ఆదివారాల్లో మాత్రమే సిరిసిల్లకు వచ్చే నాయకుడు నేడు కేవలం కాంగ్రెస్ అధికారంలో ఉందని మాత్రమే స్థానికంగా పర్యటిస్తున్నాడని చెప్పారు. బద్దెనపల్లిలో పంచాయతీ కార్యదర్శిపై మహేందర్‌రెడ్డి అనుచరులు కులపరంగా అవమానపరిచినా కలెక్టర్ కనీసం పట్టించుకోలేదన్నారు. రాబోయే రోజుల్లో కేటీఆర్ ఫొటో లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే సహించబోమని హెచ్చరించారు. గతంలోనూ అపెరల్ పార్కులో జరిగిన కార్యక్రమంలో అధికార పార్టీ నాయకుల ఫొటోలు సైతం లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేషన్ దుకాణాల నుంచి ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వరకు కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండేపల్లికి చెందిన వ్యక్తి సౌదీలో జరిగిన ప్రమాదంలో గాయపడితే సొంత ఖర్చులతో బాధితుడికి తీసుకువచ్చిన ఘనత కేటీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెగంని మనోహర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన కేటీఆర్ ఫొటో విషయంలో ప్రొటోకాల్ పాటించకపోతే సదరు కార్యక్రమాలన్నింటినీ అడ్డుకుంటామని తెలిపారు. శాంతిభద్రతకు విఘాతం కలిగించవద్దనే ఉద్దేశ్యంతోనే శాంతియుతంగా ఉంటున్నామని గుర్తుంచుకోవాలన్నారు. అభివృద్ధి విషయంలో కేటీఆర్ ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారని కొనియాడారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో పూర్తిగా కాంగ్రెస్‌కు సంబంధించిన వారికి మాత్రమే కేటాయిస్తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందని ఇదే నిజమైతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ యూత్ నాయకుడు సిలువేరి చిరంజీవి మాట్లాడుతూ, సిరిసిల్లలో ప్రొటోకాల్‌ను ఎందుకు విస్మరిస్తున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో స్వయానా సొంత పార్టీకి చెందిన ప్రభుత్వ విప్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైందన్నారు. మహేందర్‌రెడ్డికి ప్రజలే ప్రొటోకాల్ ఇచ్చారని కాంగ్రెస్ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందన్నారు. ప్రొటోకాల్ సమస్యలకు ఇకనైనా చెక్ పెట్టకపోతే లా అండ్ ఆర్డర్ ఇష్యూ వస్తుందని తేల్చిచెప్పారు. నియోజకవర్గంలో మరోసారి ప్రొటోకాల్ పాటించకపోతే బీఆర్ఎస్ శ్రేణులు ఖచ్చితంగా సదరు కార్యక్రమాన్ని అడ్డుకుని తీరుతాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు శీలం స్వామి, వేముల నరేశ్, మేరుగు తిరుపతి, కిరణ్, బండి జగన్, గుండు ప్రేమ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఎండీ జహంగీర్, రత్నాకర్, అమర్‌రావు, రాజేశ్వర్‌రావు, శేఖర్‌చారి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ అర్హత పరీక్ష ఫలితాలు విడుదల

తెలంగాణ చౌక్, మే 24: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ చారి తెలిపారు. ఈ నెల 13న జరిగిన అర్హత పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 2027 విద్యార్థులు హాజరుకాగా ఇందులో 1,625 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా ఎంపీసీ గ్రూప్‌లో జిల్లాలో ఉత్తమ ప్రతిభ చూపిన దండు సవిత, గుడిసెల మనోజ్, మంగళరాపు అమృతశ్రీవాణి మొదటి మూడు స్థానాలు సాధించగా, బైపీసీలో మంగళరాపు అమృతశ్రీవాణి, పెరుల్లి ప్రణీత, మెర్గు అక్షయ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మంచి ప్రతిభ చూపి ముందజలో నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## హన్మాజీపేట వైన్స్‌లో చోరీ

వేములవాడ రూరల్, మే 24 : వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామ శివారులో ఉన్న వైన్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపారు. రోజులాగే శుక్రవారం రాత్రి వైన్స్ మూసి ఇంటికి వెళ్లి తిరిగి శనివారం ఉదయం తెరువడానికి వచ్చిన సిబ్బందికి తాళాలు పగులకొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి చేరుకొని వైన్స్ లోపల పరిశీలించారు. వైన్స్‌లోని సీసీ పుటేజీలను గమనించగా ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి వైన్స్‌లో చొరబడినట్లు కనబడింది. అలాగే వైన్స్ బయట ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పందగా తిరుగుతూ కనబడినట్లు పేర్కొన్నారు. వైన్స్‌లో రూ.30 వేలతోపాటు కొంత మద్యం ఎత్తికెళ్లినట్లు వైన్స్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇప్పించి ఆదుకోవాలి

ఇల్లంతకుంట, మే 24 : గతంలో చేసిన పనుల బిల్లులు వెంటనే చెల్లిం చాలని మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పంచాయతీ బకాయి బిల్లుల కింద రాష్ట్ర ప్రభుత్వం రూ .153 కోట్లు విడుదుల చేశామని పత్రికలు, మీడియా ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారని, కాని దానికి సంబంధించిన సమాచారం మండల పరిషత్ కార్యాలయంలో గాని జిల్లా ఎస్టీవో కార్యాలయంలో గాని ఎక్కడా లేదని అధికారులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. నిధులు ఇచ్చామని చెప్పడం స్పష్టత లేకుండా చేయడం ద్వారా మాజీ సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో చేసిన పనుల బిల్లులు రాక మాజీ సర్పంచులు అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై స్పష్టత ఇచ్చి మాజీ సర్పంచులను ఆదుకోవాలని కోరారు.

## అంధకారంలో ఎర్రగడ్డతండా

- విద్యుత్ బకాయిలు చెల్లించలేదని కరెంట్ కట్

వీర్నపల్లి, మే24: మొండి విద్యుత్తు బకాయిలపై సెస్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఏండ్లుగా బిల్లులు చెల్లించని కనెక్షన్ల కరెంట్ సరఫరా నిలిపేస్తున్నారు. కొన్నేళ్లుగా రూ.14లక్షల బకాయిలు ఉన్నాయని, మండలంలోని ఎర్రగడ్డతండాలో సెస్ సిబ్బంది శనివారం కరెంట్ కట్ చేశారు. దీంతో గ్రామంలో అంధకారం అలుముకుంది. గ్రామస్తులు చీకట్లోనే మగ్గుతున్నారు. సెస్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే వర్షకాలం చీకట్లో విషపురుగులు వస్తున్నాయని మండిపడ్డారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు రాత్రి 7 గంటలకు కరెంటును పునరుద్ధరించారు. ఇదే విషయంపై సెస్ ఇన్‌చార్జి ఏఈ రమేశ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా గ్రామంలో పలువురికి చెందిన విద్యుత్ బిల్లులు రూ.14లక్షలు ఉన్నాయని తెలిపారు. బిల్లులు కట్టాలని పలుమార్లు గిరిజనులకు అవగాహన కల్పించిన వారిలో మార్పు రావడం లేదన్నారు. విడుతల వారిగా కట్టాలని గడువు విధించినా కూడా బిల్లులు చెల్లించకపోవంతో కరెంట్ సరఫరా నిలిపివేసామని తెలిపారు. బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## తడిసిన ధాన్యం.. తీరని నష్టం

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు


చందుర్తి : మొలకెత్తిన ధాన్యంతో రైతు గంగాధర్


రుద్రంగి : కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యంను ఆరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతు

రుద్రంగి, మే 24: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రుద్రంగి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. నెలక్రితం ధాన్యం మ్యాచర్ రాగా, వారం రోజుల క్రితం ధాన్యం తూకం వేసి బస్తాలు తరలించలేదు. వర్షం నీరు ధాన్యం బస్తాల కిందకు రావడంతో ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని రైతులు వాపోయారు. ధాన్యం తూకం వేసిన తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నామన్నారు. లారీల కొరతతో వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి, నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వేములవాడ రూరల్, మే 24 : వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పోసిన ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెలరోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తింది. ఓ వైపు ధాన్యం తడిచిన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు చెరుకు వంశీధర్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

చందుర్తి, మే 24: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షంతో చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాల, నర్సింగాపూర్ తదితర గ్రామాల్లో వడ్లు తడిసి మొలకలొస్తున్నాయి. చందుర్తి మండల కేంద్రానికి చెందిన రైతు గంగాధర్ వడ్లు తడిసి మొలికెత్తాయి. వర్షం తగ్గగానే కవర్లు తీసి ధాన్యం ఆరబెట్టడం, ముసురు రాగానే మళ్లీ కవర్లు కప్పడం పనిగా మారింది. ధాన్యం తడిసి మొలకలు వస్తున్న ఇంత వరకూ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

## విధులకు ఆటంకం కల్పించిన ముగ్గురి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, మే 24: ఇటీవల నారాయణపూర్‌లో ఓ శుభకార్యంలో డీజే శబ్దం పెట్టి రోడ్డుపై న్యూసెన్స్ చేస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు వారిస్తుండగా విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు నారాయణపూర్‌కు చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. స్థానికులు ఈ నెల 18న నారాయణపూర్‌లో పెళ్లి బరాత్‌లో పెద్ద సౌండ్‌తో డీజే ముందు నృత్యం చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి వెళ్లిన పోలీసులు డ్యాన్స్ చేస్తున్న వారిని వారించే ప్రయత్నం చేయగా చింతల వెంకటేశ్, బత్తుల నవీన్, బత్తుల దీపక్ ఎదురు తిరిగి విధులకు ఆటంకం కల్పించారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టరేట్, మే 24 : గ్రామ పాలనాధికారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, గీతానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో మూండిడ్లల్లో దొంగతనం

వేములవాడ, మే24: వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు ఇండ్లల్లో దొంగతనం జరిగింది. సాయినగర్ నుంచి బైపాస్‌రోడ్డుకు వెళ్లే మార్గంలోని ఒక కిరాణ దుకాణంలోకి తాళం పగులగొట్టి ప్రవేశించిన దొంగ రూ.5వేల నగదు అపహరించినట్లు తెలిసింది. పక్కనే ఉన్న మరో ఇంట్లో ప్రవేశించిన దొంగ దుకాణంలో చీరెలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకరి ఇంట్లో రెండు తులాల బంగారం, మరొకరి ఇంట్లో ఒక తులం బంగారం చొప్పున ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఇంట్లోని వారు తాళం వేసి ఊరికి వెళ్లినట్లు గమనించిన దొంగ ఈ చోరికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, సాయినగర్ ప్రాంతంలో వారం రోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయినగర్‌లోని తాళం వేసి ఉన్న మూడు ఇండ్లలో దొంగతనం జరిగిందని మొత్తం మూడు తులాల బంగారం, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE



★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100. NTK-330283

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788. NT-325337-All

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468. NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

## సారంపల్లిలో కారు బీభత్సం..!

- పలువురికి గాయాలు -దవాఖానకు తరలింపు

సిరిసిల్ల రూరల్, మే 24: తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు బీభత్సం సృష్టించడంతో మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో పలువురికి గాయాలవ్వగా, తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, యాదగిరిగుట్టకు చెందిన ఓ కుటుంబం వేములవాడలో రాజన్న ఆలయం లో దర్శనం చేసుకొని తమ మారుతీ షిఫ్ట్ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో సారంపల్లికి చేరుకోగానే, ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలుకొట్టి బోల్తా పడింది. కారు సైతం అదుపు తప్పి, ఆటో వెనుకాల వస్తున్న సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ డాక్టర్‌కు చెందిన ఇన్నోవా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న డ్రైవర్ గుంటుపల్లి సత్యనారాయణకు తీవ్రగాయాలవగా, అందులో ప్రయాణిస్తున్న తుపాకుల శ్రీలత, కార్మిక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108లో సిరిసిల్ల దవాఖానకు తరలించారు. ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ట్రైనీ ఎస్ఐ వినీతా రెడ్డి చేరుకుని ఘటనపై విచారణ చేశారు. సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ స్థంభించింది. ధ్వంసమైన కార్లు, ఆటోను తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వినీతారెడ్డి తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

బోయినిపల్లి రూరల్, మే 24: ఇంక్వాస్ అసెస్మెంట్‌లో భాగంగా బోయినపల్లి మండల కేంద్రంతోపాటు కొదురుపాక, విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఇంక్వాస్ అసెస్మెంట్ సభ్యులతో కలిసి జిల్లా వైద్యాధికారి రజిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందించే సేవలు, బయటి రోగులకు అందించే సేవలు, కూర్చునేందుకు వీలుగా దవాఖానలో కుర్చీలు, మందుల నాణ్యత, బెడ్స్, బాత్రూం, పరిసరాలు పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంపత్, డీపీవో రాజేందర్, ఇంక్వాస్ అసెస్మెంట్ సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ రాజీవ్ యువవికాస రుణాలు అందించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ముస్తాబాద్, మే 24 : కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను అధికారులు పారదర్శకంగా ఎంపిక చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారం బీసీ యూత్ సభ్యులతో కలిసి మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి రేవంత్ రెడ్డి సర్కార్ అనేక షరతులు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తుందన్నారు. దరఖాస్తుదారులకు ఎటువంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం సబ్సిడీ రుణాలను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య, సంతోశ్, రమేశ్, శ్రీనివాస్, రాజు, భాను, శేఖరచారి పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రుద్రంగి, మే 24: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు క్రీడలపై ఆసక్తి చూపించేలా వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు దేవయ్య ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఉదయం 6 నుంచి 8 గంటలు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రెండు గంటల పాటు చిన్నారులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. రుద్రంగితోపాటు లింగంపేట, తాండ్రియాల్, కలిగోట గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ తీసుకుంటున్నారు.

## ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట మే 24: వెంకటాపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై హాస్పిటల్లో చేర్పించగా మహిళ శనివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు పింక్ కలర్ నైటీతో గుర్తుతెలియని మహిళ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నది. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వెళుతున్న స్కూటీ నడుపుతున్న ఓ వ్యక్తి ఆమెను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ మహిళకు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆమెను సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షి వెంకటాపూర్ గ్రామానికి చెందిన మల్లాపురం వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబిషనరీ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

## రోడ్డు పనులు పూర్తి చేయాలి

వేములవాడ రూరల్, మే 24 : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పరమేశ్వర్ డిమాండ్ చేశారు. మర్రిపల్లి బ్రిడ్జి వద్ద ఆయన మాట్లాడుతూ, బ్రిడ్జి వద్ద రోడ్డు సరిగా లేకపోవడం, వర్షానికి గుంతలుగా మారడంతో ప్రయాణకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. ఇక్కడ బీజేపీ నాయకులున్నారు.

## పాలీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, మే, 24: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో జ్ఞానదీప్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. శనివారం కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ వివరాలు వెల్లడించారు. బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో సీహెచ్ సాత్విక్ రెడ్డి స్టేట్ 3,586, జె. స్నేహిత్ చరణ్ 9,346 స్టేట్ ర్యాంక్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ అభినందించారు.

## ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తెలంగాణ చౌక్, మే 24: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం, పెద్దూర్ గ్రామానికి చెందిన నర్ర బుచ్చయ్య తన ద్విచక్ర వాహనంపై ప్రధాన రహదారి దాటుతున్న క్రమంలో బెటాలియన్‌లో విధులు ముగించుకొని వస్తున్న కానిస్టేబుల్ తన ద్విచక్రవాహనంతో ఢీకొనడంతో తలకు బలమైనగాయాలు అయినట్లు తెలిపారు. వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## బోనాలలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

సిరిసిల్ల రూరల్, మే 24: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాలలో రైతు వేదికలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. జిల్లెల్లలోని బాబూ జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు గ్రామంలోని రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతులకు పంటలకు సిఫారుసు చేసిన మోతాదులోనే యూరియా వినియోగించాల ని, అధిక మోతాదులో యూరియా వాడితే కలిగే నష్టాలను వివరించారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ కనకదుర్గ, భవ్యశ్రీ, ఎంపీవో సందీప్, హార్టికల్చర్ ఆఫీసర్ గోవర్ధన్, విద్యార్థులు ఆశిష్, శిరీష, మహిళా రైతులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లు అందజేత


కోనరావుపేట : లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కోనరావుపేట, మే 24: నిరుపేదలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన 561 మంది ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు జారీ చేశామని తెలిపారు. ఇక్కడ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, పంచాయతీ కార్యదరుక్శలు తదితరులు పాల్గొన్నారు.

### రుద్రంగిలో..

రుద్రంగి, మే 24: మండల కేంద్రంలో 243 ఇండ్ల మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం లబ్ధిదారులకు అధికారులు, నాయకులతో కలిసి పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తొందర్లోనే ప్రారంభం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.